ఇంకా కల్లాల్లోనే..

ధాన్యం కొనుగోలు చేయక రైతులకు ఇబ్బందులు

- వారం రోజులుగా నిలిచిన కొనుగోళ్లు
- మబ్బులతో అన్నదాతల ఆందోళన
- సన్నరకం కొనుగోలుకు మిల్లర్ల విముఖత



రోడ్ల పై ఉన్న ధాన్యం బస్తాలు

వేంసూరు: కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు నానా ఇబ్బందులు పడుతూ రోజుల తరబడి కల్లాల వద్దే కాపాల ఉంటూ అవస్థలు పడుతున్నారు. కాంటాల కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. వేంసూరు మండలంలో దాదాపు 28 హెక్టర్లలో వరి పంటను రైతులు సాగు చేయగా వరి కోతల ప్రారంభంలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోకపోవడంతో కొంత మంది రైతులు దళారులకు విక్రయించుకున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం నుంచి ఉన్న ధాన్యంలో 60 శాతం కొనుగోలు చేయగా 40 శాతం ధాన్యం కల్లాలోనే ఉన్నాయి.

నిలిచిన కాంటాలు..

మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ, సొసైటీ కేంద్రాల్లో వారం రోజులుగా ధాన్యం కాంటాలు నిలిచిపోవడంతో ధాన్యం దగ్గర కాపాలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తేమ శాతం వచ్చి రోజులు గడుస్తున్న కాంటాలు మాత్రం వేయడం లేదు. కాంటాలు వేసిన దాదాపు రూ.1 లక్ష బస్తాలను లోడింగ్ లేకపోవడంతో రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్నాయి.

సన్నరకం కొనుగోలుకు విముఖత

సన్నరకం ధాన్యంకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలో ఎక్కువ మంది రైతులు సన్నరకం సాగు చేశారు. కొనుగోళ్ల ప్రారంభంలో అన్ని రకాలు కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం సన్నరకమైన 1262 కొనుగోలు చేయడానికి విముఖత చూపడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. డిమాండ్ ఉన్న ధాన్యాన్ని సైతం కొందరు మిల్లర్లు 1262 అని చెబుతూ కొనుగోలు చేయకుండా తరుగు ఇస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 41 కేజీ కాంటా నిర్వహించాల్సి ఉండగా అర కిలో ఎక్కువగా కాంటా వేస్తూ మరో 4 కిలోలు తరుగు ఇవ్వమంటే ప్రభుత్వం ఇచ్చే బోనస్ తరుగుకే సరిపోతుందని వాపోతున్నారు.

మబ్బులతో ఆందోళన..

ఒక పక్క యాంసంగి వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండగా, మరో పక్క పండించిన ధాన్యం రోజుల తరబడి కేంద్రాల్లో ఉండటంతో లబోదిబోమంటున్న అన్నదాతను ప్రస్తుతం మబ్బులు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

రోజుల తరబడి కేంద్రాల వద్దే..



కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం విక్రయించేందుకు అవస్థలు పడల్సి వస్తుంది.15 రోజులు నుంచి కేంద్రం వద్దే పడిగాపులుగాస్తున్నాం. తేమశాతం వచ్చిన కాంటాలు నిర్వహించడం లేదు.

– జంగా జమలయ్య, చౌడవరం

కొనుగోలు చేయాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని మిల్లులు క్వింటాకు 4 కిలోలు తరుగు అడుగుతున్నారు. అధికారులు స్పందించి 1262 రకం కొనుగోలు తరుగు లేకుండా కొనుగోలు చేయాలి

– నూనె హరిబాబు, రావులపాలెం

క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: కారేపల్లిలో పర్యటించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసిన గ్రామస్తులు పలు సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కోతులు, వీధికుక్కల బెడద బాగా ఉందని, ఇటీవల కుక్కల దాడిలో 50 గొర్రెలు మృత్యువాతపడ్డాయని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌసుద్దీన్, ఖలీలుల్లాఖాన్, సద్దాంహుస్సేన్, బూది తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో అన్నదానాలు



భోజనం వడ్డిస్తున్న దయానంద్, తదితరులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయం, వేంసూరురోడ్‌లోని మెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టాంజనేయస్వామి ఆలయంలో వీరివాడ నాభూషణం, అపర్ణ దంపతులు, పి.జితేందర్, సురజ్‌లు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు మల్లూరు అంకమరాజు, మందపాటి రవీందర్ రెడ్డి, కాలినేని కాంతారావు, దోమ ఆనంద్ బాబు, గాదె చెన్నారావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శివకుమార్

వేంసూరు: వేంసూరు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సత్తుపల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శివకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వేంసూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎంఏ.రాజు అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మధిర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మాచినేనిపాలెం గ్రామానికి చెందిన ధారావత్ ఈశ్వర్ బైక్‌పై మధిర వైపునకు వస్తుండగా మడుపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఖబరస్థాన్‌లో మొక్కలు నాటిన అధికారులు

తల్లాడ: మండలకేంద్రంలోని ముస్లిం శ్మశాన వాటిక (ఖబరస్థాన్)లో మంగళవారం అధికారులు మొక్కలు నాటారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలను నాటారు. ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి, ఈఓ కృష్ణారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కె.రవి పాల్గొన్నారు

గణపతి హోమం

కారేపల్లి: కారేపల్లిలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపీఠం వద్ద అయ్యప్ప మాలలధారులు మంగళవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నాగసాయిశర్మ ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, శాంతి హోమాలను నిర్వహించారు. గురుస్వాములు పాలిక సారయ్య, తేజావత్ శంకర్, సంగు సాయి, శ్రీను, గోకినపల్లి నాగరాజు, వెంకటేశ్వర్లు, రమేష్, పరశురాం, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక



ప్రేమ్‌కుమార్, మణికంఠ

కల్లూరు: ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తేల్లూరి ప్రేమ్‌కుమార్, ఈలప్రోలు మణికంఠ ఎన్నికైనట్టు జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తల్లాడ, పెనుబల్లి మండల కార్యదర్శులు బొల్లం కార్తీక్, తెల్లూరి భాను, కృష్ణ, రవి, మహిళా నాయకురాలు మల్లూరు సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: పంటల సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులను పాటించాలని మధిర ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మొక్కజొన్నలో కత్తెర పురుగు, వరిలో వెదజల్లే పద్ధతిపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మందులు పిచికారీ చేసే సమయంలో వేప గింజల కషాయం కలిపి పిచికారీ చేస్తే గుడ్డు దశలో నశిస్తుందన్నారు. వరి వెదజల్లే పద్ధతిలో ముఖ్యంగా కలుపు నివారణ ముఖ్యమైందని, వరి వెదజల్లిన వెంటనే లేదా 20 రోజుల తర్వాత కలుపును నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తర్ణాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైరా: ప్రభుత్వం ప్రకటించిన 1262, 1271 సన్న రకాల ధాన్యం కొనుగోలులో మిల్లర్లు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు తొలగించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ నివాసరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో కొనుగోలు కేంద్రాలను జనవరి చివరి వారం వరకు కొనసాగించాలని కోరారు. కాంటాలు వేసి వారం పది రోజులు గడుస్తున్నా బస్తాలు మిల్లులకు తరలించక పోవడంతో రైతులు కాపలా కాయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సన్నరకం ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేయిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, మీరా, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, నరసయ్య, బాణాల కృష్ణామాచారి, రామకృష్ణ, వీరభద్రం, రాజేష్ తదితరులున్నారు

చెరువు నీళ్లు వాడుకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న అధికారులు

కారేపల్లి: అనుమతులు లేకుండా చెరువుల్లోని నీళ్లు వాడుకుంటే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డీఈ బానోతు వెంకట్ నాయక్, సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసి సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొంతమంది రైతులు తమకు చెరువుల నుంచి నీళ్లు కావాలని దరఖాస్తు చేసుకుంటున్నారని, చెరువుల్లో, కుంటల్లో నీళ్లు తక్కువగా ఉండటంతో అనుమతులు ఇవ్వటం లేదన్నారు. అదేవిధంగా చెరువుల నుంచి ఎవరైనా మట్టి తోలకాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అందుబాటులో పీఆర్టీయూ సేవలు



మాట్లాడుతున్న రంగారావు

ఎర్రుపాలెం: ఉపాధ్యాయులకు అందుబాటులో పీఆర్‌టీయూ సంఘం సేవలందిస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు అన్నారు. మంగళవారం మండలంలోని బనిగండ్లపాడు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్నికైన మండల కమిటీ ప్రధాన కార్యదర్శి పాటి బాలకృష్ణ బదిలీపై ఖమ్మం వెళ్లడంతో ఆ పోస్టుకు ఎన్నిక నిర్వహించారు. మారపాక బాబురావును సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శులుగా దుద్దుకూరు గోపీకృష్ణ, మైనీడి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగా గురునాథరెడ్డి, జిల్లా బాధ్యులు శెట్టిపల్లి సంగిరెడ్డి, వెల్లంకి నాగరాజు, ఫిలిప్, సభ్యులు చిన్నప్ప, లూక్యా, అప్పల రాజు, సత్యనారాయణ రెడ్డి, రాఘవ రావు, శివకుమార్, అప్పిరెడ్డి, తదితరులున్నారు.

ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న మహేంద్రరెడ్డి


వేంసూరు: ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మెప్మా పీడీ మహేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మర్లపాడులో ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే ప్రగతిని ఎంపీడీఓ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బోనకల్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్ పున్నం చందర్‌కు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అమ్మా కమిటీలకు సంపూర్ణంగా నిధులు మంజూరు చేయాలని, అభివృద్ధి పనులు కూడా కమిటీలకు అప్పగించాలన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి సర్టిఫికెట్లు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. గుగులోతు రామకృష్ణ, సద్దాబాబు, చిన్న రంగారావు, గోపాల్‌రావు, సౌభాగ్య, లక్ష్మి ఉన్నారు.



ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం: ఇంటింటా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, నంద్రు వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఎం.ఉషాశారదకు వినతిపత్రం అందజేశారు. మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి సుబ్బారామరాజు ఉన్నారు.

ఉదయాస్తమాన పూజలు

మధిర: మధిర పట్టణంలోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో మంగళవారం ఉదయాస్తమాన పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా న్యాయవాది వాసంశెట్టి కోటేశ్వరరావు, లక్ష్మీప్రియ దంపతులు పాల్గొని స్వామివారికి శివేలి పూజ, సుబ్రమణ్య స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తలు చలువాది ధర్మారావు, శ్రీనివాసరావు, గురుస్వాములు వంకాయలపాటి నాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, వినయ్ కుమార్, చంద్రశేఖర్, గాంధీ, అప్పారావు, పుల్లారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు ఆర్టీసీ డిపో మేనేజర్ డి.శంకర్‌రావు బస్ పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిపో ఏడీసీ రామచంద్రరావు, విలేజ్ బస్ ఆఫీసర్ నాగుల్‌మీరాలు మాట్లాడుతూ... బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని, కరపత్రాలను పలువురికి అందజేశారు. దివ్యాంగుల మండల కమిటీ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఏన్కూరు: మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం కోసం తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. హద్దులు ఏర్పాటు చేసి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ టెలికాం ఆఫీసర్ కె.సందీప్, ఆఫీసు సూపరింటెండెంట్ శివరాంజీ, నాయకులు ఉప్పెర్ల ఆనందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



మధిర: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లు నందిని

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యాన మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బ్రదర్ విజయ్‌ప్రసాద్‌రెడ్డి, ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, రాష్ట్ర కన్వీనర్ ఎన్.బాలస్వామి, కో ఆర్డినేటర్ దేవ సహాయం, కార్యదర్శి సత్యానందం, పొలిటికల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి సమేలు, రవికిరణ్ ఉన్నారు.

మధిర: పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక భరత్ విద్యా సంస్థల్లో అధినేత శీలం వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ శీలం విద్యాలత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పాల్గొన్నారు. అదే విధంగా సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

బోనకల్: మండల కేంద్రంలోని మానసిక వికలాంగుల శాంతినిలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లు నందిని హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, చేబ్రోలు మల్లిఖార్జున్, సుధీర్‌బాబు, కోటేశ్వరరావు, గఫూర్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల అరెస్ట్ అప్రజాస్వామికం


సత్తుపల్లి: కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో చలో అసెంబ్లీకి వెళ్తున్న పంచాయతీ కార్మికులను అరెస్ట్ చేయటం అప్రజాస్వామికమని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకులు ఎ.శరత్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులను న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తల్లాడ: చలో అసెంబ్లీకి వెళ్తున్న పంచాయతీ వర్కర్లను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనువాసరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అరెస్ట్ చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముదిగొండ: సమస్యల పరిష్కారానికి హైద్రాబాద్‌లో చేపట్టిన ధర్నాకు పంచాయతీ కార్మికులు వెళ్లకుండా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

చింతకాని: పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర్లపూడి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చలో హైద్రాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న అప్పారావును పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సర్వీస్‌ను వెంటనే ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, టైంస్కేల్ ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సత్తుపల్లి మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. రాత పరీక్షతో నియమించిన ఉపాధ్యాయులు ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల అధ్యక్షుడు నర్సింహారావు, వెంకటేశ్వరరావు, నర్సింహారావు పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధం కావాలి

ఎర్రుపాలెం: వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని, ఆ మేరకు తల్లిదండ్రులు కూడా తమ వంతు కృషి చేయాలని మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ కోరారు. మంగళవారం కళాశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఉత్తీర్ణతా శాతం పెరిగేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. అధ్యాపకులు గడ్డమణుగు రామారావు, తిరుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్‌ల తుది జాబితా ప్రదర్శన



కొణిజర్లలో..



బోనకల్‌లో..

కొణిజర్ల: గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను మంగళవారం అన్ని పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రచురించారు. ఎంపీడీఓ రోజారాణి మాట్లాడుతూ... మండలంలో 27 పంచాయతీలకు గాను 254 పోలింగ్ కేంద్రాలు గుర్తించగా వాటికి అనుమతి లభించినట్టు తెలిపారు. సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని అన్ని పంచాయతీలకు సంబంధించిన వార్డుల తుది జాబితాను పోలింగ్‌స్టేషన్లలో మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఉంచినట్టు తహసీల్దార్ పున్నం చందర్ మంగళవారం తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఆర్టీల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

ఏన్కూరు: గిరిజన సంక్షేమశాఖలో పని చేస్తున్న సీఆర్టీల సర్వీసును క్రమబద్ధీకరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మూలపోచారం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన విరామ సమయంలో సీఆర్టీలకు సంఘీభావంగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు రాంచంద్, పుల్లయ్య, శ్రీదేవి, పుల్లయ్య, నర్సింహారావు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతు భరోసాపై స్పష్టత ఇవ్వాలి

మధిర: రుణమాఫీ, రైతు భరోసా విషయంలో రైతులకు స్పష్టత ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని, రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం సంవత్సరం గడిచినప్పటికీ పూర్తి చేయలేదని ఆరోపించారు. అనంతరం తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి వూట్ల కొండలరావు, నాయకులు పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, రహీం, రామానుజన్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మంగతాయి

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసి రోగులకు విస్తృతంగా వైద్య సేవలను అందించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన మహిళా యువజన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీ అరికట్టి, ఫీజులను ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనర్సమ్మ, పరిమళ, వెంకటమ్మ, రాంబాబు, కామేష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు బేడీలు వేయడం తగదు

అన్నం పెట్టే రైతులకు బేడీలు వేసి, జైల్లో ఉంచడం తగదని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. లగచర్ల రైతులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



మధిరలో..



తల్లాడలో..